అనారోగ్యానికి 'ఓపెన్'

- బల్దియాలో ఖాళీ ప్లాట్లు అధికం
- చెత్తా చెదారంతో నిండిన స్థలాలు.. వ్యాపిస్తున్న దుర్గంధం
- నిర్వహణ మరిచిన యజమానులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు అందస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)



బాన్సువాడ పట్టణంలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, నిల్వ ఉన్న నీరు

బాన్సువాడ : పైన కనిపిస్తున్న ఫొటో టీచర్స్ కాలనీది. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండుకుని కనిస్తున్న ఓపెన్ ప్లాట్ ఖాళీగా ఉన్న ఈ స్థలం నిర్వహణను స్థల యజమాని పట్టించుకోకపోవడంతో ఇలా అపరిశుభ్రంగా మారింది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్లు ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. వాటిని ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచుతున్న యజమానులు నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పిచ్చి మొక్కలు చెత్తచెదారంతో దోమల తీవ్రత పెరిగి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి. గతేడాది పట్టణ ప్రగతిలో మున్సిపల్ పరిధిలోని ఓపెన్ ప్లాట్లన్నింటినీ శుభ్రం చేయించిన బల్దియా యంత్రాంగం ఈ సారి అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

వందలాది ఓపెన్ ప్లాట్లు...

పట్టణ పరిధిలో 19 వార్డులు ఉన్నాయి. ఇందులో ప్రతీ వార్డులో పదుల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు దర్శనమిస్తున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండడం, పట్టణ పరిధి విస్తరిస్తుండటంతో భవిష్యత్ అవసరాల కోసం చాలా మంది ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నీరు నిలిచి అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. ఇలాంటి ఓపెన్ ప్లాట్లు పట్టణ పరిధిలో వందలాదిగా ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇందులో వీఎల్‌టీ (వేకెన్సీ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించని ప్లాట్లు సైతం అదే స్థాయిలో ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

బాన్సువాడ పట్టణంలో..

వార్డులు :	19
జనాభా :	40వేలు
పట్టణంలో ఖాళీగా ఉన్న ప్లాట్లు :	3450
వీఎల్‌టీ చెల్లిస్తున్న యజమానులు :	1640

వారికి ఆదాయం.. ప్రజలకు ప్రాణ సంకటం

పట్టణంలో షేక్‌చాంద్ హోటల్ వెనుకాల, అర్చకాలనీ, చైతన్య కాలనీ, టీచర్స్ కాలనీ, వాసవీ కాలనీ, బీసీ కాలనీ, ఇస్లాంపూర, కొయ్యగుట్ట సమీపంలో పలు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపల్ చట్టం ప్రకారం ఓపెన్ ప్లాట్లను శుభ్రం చేయించాల్సిన బాధ్యత యజమానులదే. ప్రజారోగ్యం దృష్ట్యా గతేడాది వర్షాకాలానికి ముందే శుభ్రం చేయించారు. ఈ ఏడాది ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. వాటిని శుభ్రం చేయించేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం

పట్టణంలో ఖాళీగా ఉన్న ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఖాళీ ప్లాట్లకు వీఎల్‌టీ పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ ప్లాట్లలో మొరంవేయించేలా సూచిస్తున్నాం. మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలుచేపడుతున్నాం.

–రమేశ్, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. రూ. 4 కోట్లతో చేపడుతున్న మల్టీ జనరేషన్ పార్కు, రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మున్సిపాలిటీ నూతన భవనం, రూ.కోటితో చేపడుతున్న ఆర్డీవో కార్యాలయం, మినీ ట్యాంకు బండ్, డీఎస్పీ కార్యాలయ నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో భుజంగరావు, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సీఐలు మురళి, మహేందర్‌రెడ్డి, నాయకులు ఎజాస్, పాత బాలకృష్ణ, వెంకట్‌రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజీపేట తండాకు చెందిన బానోత్ ముకేశ్ ఐఐటీలో సీటు సాధించినట్లు తండా వాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తన క్యాంపు కార్యాలయంలో సన్మానించి ఆర్థిక సమాయం అందజేశారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు సర్వన్, ముదాం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ కమిటీ



లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు తండా గ్రామ యూత్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు మండల యూత్ అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. తండా యూత్ అధ్యక్షుడిగా బాదావత్ భాస్కర్, ఉపాధ్యక్షుడిగా మాలోత్ భాస్కర్ తదితరులను ఎంపిక చేశారు. నాయకులు దశరథ్, మోహన్, శివన్న, శ్రీను, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'తాగి నడిపితే జైలుకే'



మాచారెడ్డి: మద్యం తాగి వాహనం నడిపితే ఎంతటి వారినైనా జైలుకు పంపిస్తామని మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం గజ్యా నాయక్ తండా చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోయినా కేసులు బనాయిస్తామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపే ముందు ఒక్కసారి భార్యా పిల్లల్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బిచ్కుంద(జుక్కల్): పత్లాపూర్‌లో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.4 లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ అశోక్ పటేల్ ప్రారంభించారు. జెడ్పీటీసీ నాల్చర్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావ్‌దేశాయ్, ఎంపీటీసీ యాదవ్‌రావ్, సర్పంచ్ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్టమైనవి



మద్నూర్(జుక్కల్): బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సీడీపీవో సునంద పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మద్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో తల్లిపాల వారోత్సవాలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్, వైద్యుడు విక్రమ్, నాయకులు కుషాల్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్



కేటీఆర్ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్, నూతన బస్టాండ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ నెల 14న మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్నందున పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం కేటీఆర్ సభ స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, సొసైటీ చైర్మన్ నర్సింలు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, కౌన్సిలర్లు భూంగారి రాము, తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కన్నారెడ్డి గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కన్నారెడ్డి, చిన్నఆత్మకూర్ గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం ఎల్లారెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను వేర్వేరుగా కలిశారు. రెండు గ్రామాలు నూతన జీపీలుగా ఏర్పాటవుతున్న క్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీధర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఎంపీటీసీలఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

రెండు గ్రామాలలో ప్లాట్ల కోసం స్థలాల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వదల్‌పర్తి, జలాల్‌పూర్ గ్రామాలలో ఇళ్ల ప్లాట్ల కోసం ఎంపిక చేసిన స్థలాలను మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో రాథోడ్ రమేశ్ పరిశీలించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు గతంలో వదల్‌పర్తిలో సర్వే నెంబర్-302లో, జలాల్‌పూర్‌లో సర్వే నెంబర్-62లో స్థలాలను ఎంపిక చేశారు. గతంలో ఎంపిక చేసిన స్థలాలలో ప్రస్తుతం ఎన్ని ప్లాట్లు చేయవచ్చనే అంశంపై రెవెన్యూ సిబ్బందితో ఆయన చర్చించారు. నాగిరెడ్డిపేట డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, సర్వేయర్ అభిలాష్, తదితరులున్నారు.

స్వచ్ఛ భారత్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛభారత్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జీపీ పరిధిలో ఐదు సోక్‌పిట్లను తవ్వించాలన్నారు. స్వచ్ఛభారత్‌పై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, ఈసి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. బొజుగంచెరువుతండా జీపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రతి వార్డును శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి అనితకు సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో దోమల మందును పిచికారీ చేయించారు. వార్డు సభ్యులు జగ్గ బాల్‌రాజు, పెసరి సాయిలు పాల్గొన్నారు.

ఒకరోజు నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా శ్రీధర్



శ్రీధర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఒకరోజు నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా మంగళవారం శ్రీధర్ విధులు నిర్వహించారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సయీద్ ఎన్నికల బదిలీలలో భాగంగా కామారెడ్డి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ తహసీల్దార్ శ్రీధర్‌ను నాగిరెడ్డిపేటకు బదిలీ చేశారు. ఇదే సమయంలో తహసీల్దార్ శ్రీధర్ ఆర్డీవోగా పదోన్నతి పొందుతూ జీహెచ్‌ఎంసీకి బదిలీ అయ్యారు. ఒకేఒక్కడు సినిమాలో హీరో అర్జున్ ఒకరోజు సీఎంగా ఉన్నట్లు శ్రీధర్ ఒకరోజు నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



బీబీపేట: హరితహారంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటుకునేలా వారిని ప్రోత్సహించాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ అన్నారు. మంగళవారం మండల ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ కింద బీబీపేట మండలంలో 8,700 మొక్కలు నాటాలని తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించండి



కామారెడ్డి రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం నర్సన్నపల్లి, కోటాల్‌పల్లి, లింగాయిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు నవనీత, గంగుబాయి, అనిల్ తదితరులున్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు



మాచారెడ్డి: ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మూడు ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంజూరు పత్రాలను అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్ చంద్రం, నాయకులు శ్రీనివాసచారి, మల్లేష్ యాదవ్, తదితరులున్నారు.

గంజ్ వ్యాపారి కుటుంబానికి పరామర్శ

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన గంజ్ వ్యాపారీ సామల బాల్‌నర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంగళవారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు.

సంక్షిప్తం

యువ వ్యాపారి మృతి

భిక్కనూరు: మండల కేంద్రంలో స్థానికంగా ఉంటున్న వస్త్ర వ్యాపారి ముర్కి సంతోష్(42) మంగళవారం రాత్రి అకస్మాతుగా మృతి చెందారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఆయనకు భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సీహెచ్‌సీలో ప్రతి మంగళవారం కంటి పరీక్షలు

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక సీహెచ్‌సీలో ప్రతి మంగళవారం కంటి పరీక్షలు చేస్తామని కంటి వైద్య సహాయకులు కిషన్ రావు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిని సర్పంచ్ సంజీవు సందర్శించారు.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి చేయాలి

గాంధారి(ఎల్లారెడ్డి): దివ్యాంగ చిన్నారులకు వైద్యుల సూచన మేరకు ఫిజియోథెరపి చేయించాలని ఎంఈవో సేవులా అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం 8 మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నిజాంసాగర్(జుక్కల్): ప్రధాన రహదారిపై పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఏఎస్సై రాజేశ్వర్ మంగళవారం బాధితుడు కుర్మ మల్లేష్‌కు అందజేశారు. మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మల్లేశ్ మొబైల్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి గుర్తించినట్లు ఏఎస్సై వివరించారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

దోమకొండ: రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. మంగళవారం సంఘమేశ్వర్ గ్రామ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షూ, బెల్టు, టైలను ఉచితంగా అందజేశారు. ఎంపీపీ కానుగంటి శారద, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు అడుగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: చిన్నమల్లారెడ్డికి చెందిన బీడీ కార్మికురాలు మృతి చెందితే ఆమెకు వచ్చిన పీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు అడుగుతున్న ఆ బీడీ కంపెనీ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కార్మికురాలి కుమారుడు శ్రీకాంత్ మంగళవారం జిల్లా కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

ఎంపీటీసీ దీక్షకు బీఎస్‌పీ మద్దతు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎంపీటీసీ ఉమాదేవికి బీఎస్‌పీ నాయకులు సాయిబాబా మద్దతు తెలిపారు. 13 రోజులుగా ఎంపీటీసీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీటీసీ రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఎంపీటీసీ చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

రాజంపేట: ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన పాపాయ మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. చికిత్సకు సరిపడా డబ్బులు లేకపోవడంతో ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను సంప్రదించారు. బాధితునికి రూ.1.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే మంజూరు చేయించారు. మంగళవారం హైదరాబాద్‌లో నాయకులు రాజేశ్వర్ గౌడ్ చేతుల మీదుగా బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

గృహలక్ష్మి దరఖాస్తులకు వార్డుల వారీగా కౌంటర్లు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గృహలక్ష్మి పథకానికి సంబంధించి ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. ఇప్పటి వరకు 42 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి

బిచ్కుంద(జుక్కల్): ఆసక్తి ఉన్నవారు 2023–2025గాను మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్‌కు చెందిన కృష్ణవేణి, సోముర్‌కు చెందిన కాశీనాథ్ పటేల్ మద్యం దుకాణాల కోసం టెండర్ వేసినట్లు ఆయన తెలిపారు. 18 ఆఖరి తేదీ అని చెప్పారు.

కబడ్డీ ఆడి నిరసన తెలిపిన జీపీ కార్మికులు

బీబీపేట/నస్రుల్లాబాద్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం బీబీపేట మండల కేంద్రంలో కబడ్డీ ఆడి జీపీ కార్మికులు నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నస్రుల్లాబాద్‌లో గ్రామ పంచాయతీ సిబ్బంది డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



పిట్లం(జుక్కల్): పిట్లం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నామని, తెలంగాణ వచ్చిన తర్వాత బతుకులు బాగుపడతాయని అనుకున్నాం కానీ ఇప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పుడు తమకు పరీక్షలు పెడుతామని అంటున్నారు.. ప్రభుత్వం తమపై దయతలచి నోటిఫికేషన్‌ను రద్దు చేసి రెగ్యులర్ చేయాలని కోరారు.

పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్ల ఆవిష్కరణ



సాక్షి నెట్‌వర్క్:ఈ నెల 13న జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్లను నస్రుల్లాబాద్, దోమకొండ, పెద్దకొడప్‌గల్ మండలాల్లో పద్మశాలి సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి మండలం నుంచి పెద్ద సంఖ్యలో పద్మశాలి యుద్ధభేరికి తరలిరావాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో పద్మశాలీలకు సముచిత స్థానం ఇచ్చి ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీకి రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలనే డిమాండ్‌తో చలో కోరుట్ల సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేటలో ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



రాజంపేటలో..

లింగంపేట/రాజంపేట(ఎల్లారెడ్డి): సీపీఎస్ రద్దు చేయాలని డిమాండు చేస్తూ ఉపాధ్యాయులు ఈ నెల 12న చలో హైదరాబాదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీపీఎస్ రద్దు కోసం తలపెట్టిన చలో హైదరాబాదు పోస్టర్లను ఆవిష్కరించారు.

రాజంపేటలో.. రాజంపేట: రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధనకై చలో హైద్రాబాద్ పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాణాల భాస్కర్‌రెడ్డి, పటేల్ అనిల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నళిని, సాయిరెడ్డి, లక్ష్మీనారాయణ, సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి



దొంగ్లీలో టీకాలు వేస్తున్న చైర్మన్ శ్రీరాంపటేల్

మద్నూర్(జుక్కల్): పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీసీసీబీ జిల్లా డైరెక్టర్, డోంగ్లీ సొసైటీ చైర్మన్ శ్రీరాంపటేల్ పేర్కొన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 1 వరకు టీకాలు వేస్తారని పశువైద్యుడు వినీత్ చెప్పారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెంకటాపూర్‌లో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించి టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్, రమేష్ తదితరులున్నారు.

కుప్రియాల్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ స్వరూప భూంరెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ్‌గౌడ్, రైతుబంధు మండలాధ్యక్షుడు భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు తాడ్వాయిలో పశు వైద్య శిబిరం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాదికారి రాంచంద్రం తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలని సూచించారు. శిబిరం బుధ, గురు వారం రెండు రోజుల పాటు కొనసాగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

మద్దికుంటలో ఎమ్మెల్యే పర్యటన

రామారెడ్డి (ఎల్లారెడ్డి): పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు నేడు కామారెడ్డి ఎమ్మెల్యే మద్దికుంట గ్రామానికి రానున్నారు. గ్రామంలో పూర్తి చేసుకున్న పనులను ప్రారంభించడంతో పాటు, కొత్తగా చేపట్టే పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సర్పంచు ఫోరం మండలాధ్యక్షుడు రాంరెడ్డి, బీఆర్ఎస్ నేత బుచ్చిరెడ్డి తెలిపారు.

రేపు అడ్లూర్‌ఎల్లారెడ్డిలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్ పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించనునుట్ల విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో పాటు పలువురు హాజరుకానున్నట్లు తెలిపారు.

10న శాంతియుత ర్యాలీ

కామారెడ్డి రూరల్: కనీసలు వేతనాల అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహా శాంతియుత ర్యాలీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దామోదర చారీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కామారెడ్డి ఎంఈవో కార్యాలయం ఎదుట వారు మాట్లాడారు. సమావేశంలో సీఆర్‌పీలు చిరంజీవి, మాధవి తదితరులున్నారు.